పార్లమెంట్ సమావేశాలలో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రాజేశ్వర్‌యాదవ్

సైదాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) : రాబోయే వర్షాకాల పార్లమెంట్ సమావేశాలలో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు రాజేశ్వర్ యాదవ్ శనివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. దేశంలో బీసీ కులగణన చేపట్టాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జాతీయ బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.5000 కోట్ల నిధులు మంజూరు చేసి నిరుద్యోగుల స్వయం ఉపాధికి అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రైవేటు సంస్థలలో బీసీ రిజర్వేషన్ల అమలుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సత్యనారాయణ, భాస్కర్, రాజు, జగదీష్‌గౌడ్, రవిచారి, సాయి రాహుల్ పాల్గొన్నారు.

సీఎంను కలిసిన చంపాపేట డివిజన్ కాంగ్రెస్ నేతలు


సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న కాంగ్రెస్ యువ నాయకులు గూడూరు గౌతంరెడ్డి, నిషికాంత్‌రెడ్డి

చంపాపేట, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని శనివారం చంపాపేట డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ యువ నాయకులు గూడూరు గౌతంరెడ్డి, నిషికాంత్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలో పలు బెట్టింగ్ యాప్స్, ఆన్‌లైన్ గేమ్స్ వల్ల యువత నష్టపోతున్నట్లు, వాటిని నిషేధించాలని వారు సీఎంను కోరారు. సీఎం సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు.

మీ సేవా నిర్వాహకులు నిబంధనలు పాటించాలి

సైదాబాద్, జూన్ 22(ఆంధ్రజ్యోతి): మీ సేవా నిర్వాహకులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాల్సిందేనని సైదాబాద్ మండల తహసీల్దార్ జయశ్రీ సూచించారు. శనివారం మండల కార్యాలయంలో మీ సేవా నిర్వాహకులతో సమావేశమయ్యారు. మీ సేవా కేంద్రాలలో సిటిజన్ చార్టర్‌ను ఖచ్చితంగా ప్రదర్శించి, అనుసరించాలని కోరారు. వచ్చిన దరఖాస్తులు అదే రోజు సమర్పించాలని, ఆన్‌లైన్‌లో అవసరమైన అన్ని పత్రాలు అప్‌లోడ్ చేయాలని తెలిపారు. రసీదులు నిర్దేశించిన పద్ధతిలో మాత్రమే ఇవ్వాలని, దరఖాస్తుదారులకు ఇబ్బందులు కలిగించవద్దని అన్నారు. ప్రతి నెల 5న మీ సేవా నిర్వాహకులతో సమావేశం నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తానని వెల్లడించారు.

ప్రగతి చక్రం అవార్డుల అందజేత



మిధానీ బస్‌డిపోలో సిబ్బందికి ప్రగతి చక్రం అవార్డులను అందజేస్తున్న డీఎం ఆంజనేయులు

చంపాపేట, జూన్ 22(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రకటించిన లక్ష్యే లక్షణం చాలెంజ్‌ను స్వీకరించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు కంచన్‌బాగ్‌లోని మిధానీ ఆర్టీసీ బస్‌డిపోలో శనివారం డిపో మేనేజర్ కె.ఆంజనేయులు ప్రగతి చక్రం అవార్డులను అందజేసి ఘనంగా సన్మానించారు. బెస్ట్ ఈపీకే, టీఎవైఎల్, కేఎంపీఎల్, మెయిన్‌టెనెన్స్‌లో వీ.శ్రీనివాసులు, విజి రెడ్డి, రజిత, సుభాషిణీ, హరిత, స్వర్ణలత, వెంకటేశ్(మెకానిక్), రాంబాబు(టైర్)లు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఐ గురుస్వామి, ఎంసీ ఓమర్, కేబీ స్వామి, ఎంప్లాయీస్ వెల్ఫేర్ బోర్డు సభ్యులు సయ్యద్ జహంగీర్, రాధ తదితరులు పాల్గొన్నారు.

రాచకొండ కమిషనరేట్‌లో ఇన్‌స్పెక్టర్‌ల బదిలీ

హైదరాబాద్ సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రాచకొండ కమిషనరేట్‌లో పలువురు ఇన్‌స్పెక్టర్‌లను బదిలీ చేస్తూ సీపీ తరుణ్ జోషి ఆదేశాలు జారీ చేశారు. సైబర్ క్రైం విభాగంలో పనిచేస్తున్న ఏ వెంకటయ్యను కీసర ఎస్‌హెచ్‌ఓగా, కీసర ఎస్‌హెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్న కే శీతారామ్‌ను కందుకూరు ఠాణాకు, కందుకూరు ఎస్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న మక్బూల్ జానీని సైబర్‌క్రైం విభాగానికి, యాదాద్రి ట్రాఫిక్ విభాగంలో పనిచేస్తున్న కె నాగరాజును మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు, హయత్‌నగర్ డీఐగా పనిచేస్తున్న కె శ్రీనివాస్‌ను మహేశ్వరం ఎస్‌ఓటీకి బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

కాలనీలో సమస్యలను పరిష్కరించడమే ధ్యేయం


శ్రీనగర్‌కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: కాలనీలో నెలకొన్న సమస్యలన్నింటిని పరిష్కరిస్తానని గడ్డిఅన్నారం డివిజన్ కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలోని శ్రీనగర్‌కాలనీలో శనివారం ఆయన శానిటేషన్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పారిశుధ్య కార్మికులు రహదారులను శుభ్రం చేయకపోవడం మూలంగా, కాలనీ అంతర్గత రహదారుల్లో చెత్త, చెదారం పేరుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు శ్రీనివాస్, బ్రహ్మచారి, కీర్తికాంత్ పాల్గొన్నారు.

కాలనీవాసుల సమస్యలను పరిష్కరిస్తా: లచ్చిరెడ్డి


కాలనీవాసులతో కలిసి పాదయాత్ర నిర్వహిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ చైతన్యనగర్ కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు శనివారం కాలనీలో పర్యటించి కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు తిప్పర్తి జలందర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, సంజీవరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, పవన్‌రెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించాలి: రాగుల


అభివృద్ధి పనులపై కాలనీవాసులతో చర్చిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్వర్‌రెడ్డి

వనస్థలిపురం, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): కాలనీలో చేపట్టబోయే అభివృద్ధి పనులను త్వరితగతిన ప్రారంభించాలని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. వనస్థలిపురం డివిజన్ వెంకటరమణకాలనీలో నూతనంగా చేపట్టబోయే పనులను ఏఈ ప్రజ్ఞతో కలిసి శనివారం పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యతతో జరిగేవిధంగా కాలనీవాసులు తగు చొరవ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

బాక్స్ డ్రైన్ నాలా సమస్యలను పరిష్కరించాలి


డ్రైనేజీ సమస్యలను పరిష్కరిస్తున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

వనస్థలిపురం, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) : డ్రైనేజీ పైప్‌లైన్ల బ్లాక్‌తో డ్రైనేజీలు నిండి దుర్వాసన రావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించడంలో జాప్యం చేయడాన్ని సహించరానిదని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మన్సూరాబాద్‌లోని సహారా ఎస్టేట్స్ 10 బ్లాక్ వద్ద డ్రైనేజీ బ్లాకై మురుగునీరు పోవడం లేదని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ మేరకు శనివారం కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి డ్రైనేజీ సమస్యలను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

అతివేగం, నిర్లక్ష్యంతోనే ప్రమాదాలు

- డ్రైవర్లకు రోడ్డు భద్రతపై శిక్షణ ఇచ్చిన ట్రాఫిక్ పోలీసులు
- రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహణ



డ్రైవర్‌లతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పోలీసు అధికారులు

హైదరాబాద్ సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): అధిక వేగం, నిర్లక్ష్యం కారణంగా ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రతి డ్రైవరు బాధ్యతతో వాహనాన్ని నడపాలని ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులు తెలిపారు. రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ ట్రాఫిక్ సేఫ్టీ ఫోరం, రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శనివారం ఆటోనగర్‌లో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మన కుటుంబ రక్షణ మన బాధ్యత అని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. వాహనాలు నడిపే డ్రైవర్ల శారీరక, మానసిక స్థితి సరిగా ఉంటేనే ప్రమాదాలు జరగకుండా విధిని సక్రమంగా నిర్వహించగలరని తెలిపారు. డ్రైవర్లు మానసికంగా, శారీరకంగా సరిగా ఉంటే డ్యూటీని సక్రమంగా నిర్వహించగలరని తెలిపారు. డ్రైవర్లు తాము నడిపే వాహనాల పరిస్థితి, పత్రాలు సరిచూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బాధ్యతగా వాహనాలు నడుపుతామని డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి, మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ అనూష, శ్రీనివాస ట్రావెల్స్ ఎండీ కోటి శ్రీనివాసరావు, రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ కోఆర్డినేటర్ సావిత్రి, పలువురు డ్రైవర్లు పాల్గొన్నారు.

27 నుంచి క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు ఎంపికలు

- నాలుగో తరగతికి అర్హత పరీక్షలు
- జింఖానా మైదానంలో నిర్వహణ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలోని క్రీడాపాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి నాలుగో తరగతిలో ప్రవేశానికి ఎంపికలు నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం తెలిపారు. సికింద్రాబాద్‌లోని జింఖానా మైదానంలో ఈనెల 27 నుంచి 30 వరకు ఉదయం 8 గంటల నుంచి ఎంపిక పోటీలుంటాయని చెప్పారు. 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, 6-10 మీటర్ల షటిల్ రన్, స్టాండింగ్స్ బ్రాడ్ జంప్, వర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటీ, కిలో మెడిసిన్ బాల్‌త్రో, 800 మీటర్ల పరుగు, బరువు, ఎత్తు, మెడికల్ టెస్టులుంటాయన్నారు. హైదరాబాద్ జిల్లాలో మండల స్థాయి ఎంపికలు ఈ నెల 24, 25 తేదీల్లో జరుగుతాయని, జిల్లా స్థాయి ఎంపికలు 27 నుంచి 30 వరకు నిర్వహిస్తామన్నారు. అలాగే రాష్ట్రస్థాయి ఎంపికలు జులై 8 నుంచి 12 వరకు హకీంపేటలో ఉంటాయని చెప్పారు. ప్రవేశ పోటీలకు హాజరయ్యే బాలబాలికలు 1.9.2015 నుంచి 31.08.2016 మధ్య పుట్టిన వారై ఉండాలని, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రాన్ని తీసుకురావాలని వివరించారు. మరిన్ని వివరాలకు జిల్లా స్పోర్ట్స్ అథారిటీకి చెందిన 040-27900649 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వివేకానంద విదేశీ విద్యా పథకం

నిధుల విడుదలకై పోస్ట్‌కార్డు ఉద్యమం


పోస్ట్ కార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు సిద్ధాంతి

దిల్‌సుఖ్‌నగర్, జూన్ 22(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌లో వివేకానంద విదేశీ విద్యా పథకం ద్వారా నిధుల మంజూరు ఉత్తర్వులు పొంది ఆరు నెలలైనా.. ఇంకా నగదు విడుదల చేయకపోవడం పట్ల ప్రభుత్వం సత్వరమే స్పందించాలని కోరుతూ తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో శనివారం పోస్ట్‌కార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. పేద బ్రాహ్మణ విదేశీ విద్య బాధితుల ఆవేదన ఆలకించాలంటూ.. ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడిచర్ల నాగేశ్వరరావు సిద్ధాంతి పోస్ట్ కార్డు ఉద్యమాన్ని దిల్‌సుఖ్‌నగర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశీ విద్య నిధులు మంజూరు కాకపోవడం మూలంగా పేద బ్రాహ్మణ విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులు పడుతున్న ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి చేరే విధంగా ప్రతి బ్రాహ్మణుడు ఒక పోస్ట్ కార్డును సీఎంకు పంపించాలని సూచించారు. వివేకానంద విదేశీ విద్యా పథకం ద్వారా విదేశీ విద్యకు నిధుల మంజూరు లెటర్స్ ఇవ్వడంతో పాటు, మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ నిధులు విడుదల చేశారు. దీంతో చాలా మంది విద్యార్థులు కళాశాలల్లో చేరడం జరిగిందన్నారు. మిగతా ఇన్‌స్టాల్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబులు వివేకానంద విదేశీ విద్యా పథకం నిధులు విడుదలయ్యేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని విన్నవించారు. పేద బ్రాహ్మణులను ఆదుకోవాలని వక్కలంక శ్రీనివాస్‌రావు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మునిపల్లె శ్రీనివాస్ కోరారు. నిధులు విడుదల కాకపోవడం మూలంగా సుమారు 300 మంది విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. త్వరలోనే హైదరాబాద్‌లోని అన్ని సంఘాల వారితో పోస్ట్‌కార్డు ఉద్యమాన్ని మొదలుపెడతామన్నారు. కార్యక్రమంలో స్త్రీశక్తి అనురాధ, నాగరాజు, అన్నంబొట్ల పవన్, రఘునందన్ తదితరులు పాల్గొన్నారు.

మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డికి ఉత్తమ సేవా పతకం


మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి

ఉప్పల్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ విధులలో ఉత్తమమైన సేవలు అందించినందుకుగాను మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డికి ప్రభుత్వం సేవా పతకాన్ని ప్రకటించింది. గోవిందరెడ్డి స్వస్థలం నల్గొండ జిల్లా కోదాడ. 2004బ్యాచ్‌కు చెందిన ఆయన గతంలో బంజారాహిల్స్, ఉప్పల్, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లో ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించి విధి నిర్వహణలో మంచి సంపాదించారు. ప్రస్తుతం మేడిపల్లి ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనకు విధి నిర్వహణలో ఉత్తమమైన సేవలు అందించినందుకు గాను ఆయనకు ప్రభుత్వం సేవాపతకాన్ని ప్రకటించింది. ఇప్పటి వరకు ఆయన 120 గుడ్ సర్వీస్ ఎంట్రీలు (జిఎస్‌ఇ), 10 మెరిటేరియస్ సర్వీస్ సెంటర్ (ఎంఎస్‌ఈ)లు, 6 అప్రిషియేషన్స్, రివార్డులను అందుకున్నారు. రాచకొండ కమిషనరేట్ నుంచి ఉత్తమ సేవా పతకాలు అందుకున్న వారిలో ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మన్మోహన్, ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌బాబు, ట్రాఫిక్ ఎస్‌ఐ యాలాద్రి, ఏఎస్‌ఐలు భారతమ్మ, నవీన్‌రెడ్డి, ఏఆర్‌ఎస్‌ఐ వెంకటయ్య, కృష్ణ, హెడ్‌కానిస్టేబుళ్లు యాదయ్య ఉన్నారు.

రుణమాఫీతో 46వేల మంది రైతులకు లబ్ధి

- రంగారెడ్డి డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య


కొత్తకుర్మ సత్తయ్య

హైదరాబాద్ సిటీ : రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తూ సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని టెస్కాబ్, వైస్ చైర్మన్, రంగారెడ్డి డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య అన్నారు. ఈ నిర్ణయం చారిత్రాత్మకమని, రుణమాఫీతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సహకార బ్యాంకుల ద్వారా రుణాలు పొందిన సుమారు 46వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. రాష్ట్రంలోని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ తీవ్ర ఆర్థిక భారం పడుతున్నప్పటికీ వాటిని లెక్కచేయకుండా ఒకేసారి రూ. 31వేల కోట్లు చెల్లించేందుకు పూనుకోవడం గొప్ప నిర్ణయమన్నారు. రైతు రుణమాఫీ నిర్ణయంపై రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుందన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకిచ్చిన అన్ని హామీలను అమలుచేస్తూ ప్రజా పాలన అందిస్తున్న ఘనత ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

ఎస్‌ఎస్‌సీ టాపర్లకు నగదు పురస్కారాలు

ఎల్‌బీనగర్, జూన్ 22(ఆంధ్రజ్యోతి): సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023-24 సంవత్సరానికి ఎస్‌ఎస్‌సీ పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన ఆరుగురు విద్యార్థులను రామోజు వీరమ్మ, బ్రహ్మచారి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించి పురస్కారాలు ప్రదానం చేశారు. పది పరీక్షల్లో టాపర్స్‌గా నిలిచిన నజియఖాతున్, జాహ్నవి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్. స్మిత, నందిని, అనూజలకు ఒక్కొక్కరికి రెండు వేల రూపాయలు నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుటం పురుషోత్తంరావు, కర్మన్‌ఘాట్ శ్రీధ్యానాంజనేయస్వామి ఆలయ ధర్మకర్త బబ్బూరి ఆనంద్‌కుమార్‌గౌడ్, జీపీ రాములు, జంగయ్యయాదవ్, ఆర్. సద్గుణాచారి, డాక్టర్ పవన్‌కుమార్, అరవిందకుమార్, ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మలక్‌పేటలో చెయిన్ స్నాచర్ అరెస్టు, రిమాండ్

చాదర్‌ఘాట్, జూన్ 22(ఆంధ్రజ్యోతి): మలక్‌పేటలో మంగళవారం రాత్రి మహిళ మెడలోని మంగళసూత్రాన్ని లాక్కొని పారిపోయిన చెయిన్ స్నాచర్‌ను మలక్‌పేట పోలీసులు శనివారం అరెస్టు చేశారు. నిజామబాద్ ఆర్మూర్ గ్రామానికి చెందిన సాయికుమార్(28) ప్రైవేటు ఉద్యోగి, ఆయనకు భార్య, ఒక బాబు ఉన్నారు. ఆర్థిక సమస్యలతో పాటు భార్య అనారోగ్య సమస్యతో అప్పులయ్యాయి. ఇటీవల పుట్టిన బాబు ఆస్పత్రి ఖర్చులు కూడా భారం కావడంతో అప్పులు చేశాడు. చేసిన అప్పులు తీర్చలేక దొంగతనం చేయాలనుకున్నాడు. మొదటి సారి మలక్‌పేట ముంతాజ్ కాలేజీ లేన్‌లోని అనుసూయ రెసిడెన్సీలో నివాసముంటున్న విజయమ్మ తన మెడికల్ షాపును మంగళవారం రాత్రి 10గంటల ప్రాంతంలో మూసివేసి తన భర్తతో కలిసి నడుచుకుంటూ ఇంటికి వస్తుండగా యాక్టీవాపై వచ్చిన వ్యక్తి ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును లాక్కొని పారిపోయాడు. ఈమేరకు బాధితురాలు విజయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. సీసీ పుటేజీలను పరిశీలించగా చెయిన్ స్నాచింగ్‌కు వచ్చిన వ్యక్తి యాక్టీవాపై వచ్చినట్లు గుర్తించారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీనగర్‌కాలనీలో గల గాంధీవిగ్రహం వద్ద రిజిస్ట్రేషన్ కాని యాక్టీవా ఆగి ఉన్నట్లుగా గుర్తించారు. యాక్టీవా కోసం వ్యక్తిని పట్టుకుని విచారించగా చెయిన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు వెల్లడైంది. అప్పుల బాధను తీర్చుకోవడానికి తాను చెయిన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. అనంతరం సాయికుమార్‌ను శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మలక్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో ఫుట్‌పాత్‌పై వ్యక్తి మృతదేహం

- ఆటోలో తెచ్చి పారేసినట్లు గుర్తించిన పోలీసులు


శ్రీకాంత్(ఫైల్)

సైదాబాద్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో ఫుట్‌పాత్‌పై ఉన్న వ్యక్తి మృతదేహాన్ని సైదాబాద్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీసీ పుటేజీ ఆధారంగా మృతదేహాన్ని ఆటోలో తీసుకువచ్చి పడవేసినట్లు పోలీసులు గుర్తించారు. లక్ష్మీనగర్ పార్కు సమీపంలో శనివారం తెల్లవారుజామున ఓ వ్యక్తి మృతదేహం పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు సైదాబాద్ పోలీసులకు సమాచారమందించారు. మృతుడు రంగారెడ్డి జిల్లా పరూఖ్‌నగర్ మండలం అన్నారం గ్రామంలో వ్యవసాయం చేసే సంగమూల శ్రీకాంత్(40)గా గుర్తించారు. శుక్రవారం రాత్రి 11.47గంటల సమయంలో డ్రైవర్ ఆటోలో తీసుకువచ్చి పడవేసినట్లు సీసీ ఫుటేజీలో రికార్డయింది. ఈ మేరకు ఆటో డ్రైవర్‌ను గుర్తించి అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

గొంతులో చికెన్‌ముక్క ఇరుక్కొని మృతి..?

శ్రీకాంత్ మృతిపై పలు అనుమానాలు తలెత్తుతున్నాయి. శుక్రవారం సాయంత్రం బస్సులో నగరానికి వచ్చి ఇమ్లీబన్ బస్టాండ్‌లో దిగాడు. అనంతరం కోఠీలో ఓ వైన్స్‌షాపులో మద్యం సేవించాడు. రాత్రి 11.10 గంటల సమయంలో మద్యం మత్తులో ఉన్న శ్రీకాంత్ సైదాబాద్ ఇంద్రప్రస్థకాలనీలోని సోదరికి ఫోన్‌చేసి ఇంటికి వస్తున్నానని చెప్పాడు. ఆటోలో బయలుదేరిన శ్రీకాంత్ సోదరి ఇంటిని గుర్తించలేని పరిస్థితులలో పలుచోట్ల తిప్పడంతో బలవంతంగా లక్ష్మీనగర్ పార్కు ఫుట్‌పాత్ వద్ద పడవేసి వెళ్లానని ఆటో డ్రైవర్ చెప్పినట్లు తెలిసింది. అతిగా మద్యం సేవించడంతో పాటు వెంట తెచ్చుకున్న చికెన్ తినడంతో శ్రీకాంత్‌కు గొంతులో చికెన్ ముక్క ఇరుక్కుపోయి ఊపిరాడక మృతి చెందినట్లు ప్రాథమికంగా పోస్టుమార్టంలో తెలినట్లు సమాచారం. సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అష్టలక్ష్మీ ఆలయంలో జ్యేష్ఠాభిషేకం వేడుకలు


దేవదేవేరులకు అభిషేకం చేస్తున్న అర్చకులు

ఎల్‌బీనగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): అష్టలక్ష్మీ ఆలయంలో జ్యేష్ఠాభిషేకం వేడుకలు ఘనంగా నిర్వహించారు. జ్యేష్ఠ మాసాన్ని పురస్కరించుకుని అష్టలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామికి 473 రాగి కలశములతో విశేషమైన ఉపచారములతో శనివారం మహాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు మరిగంటి రాఘవాచార్యులు, చైర్మన్ సోమ సురేష్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్, కోశాధికారి అయిత అంజయ్య, మాజీ చైర్మన్ మేడం సుధాకర్‌గుప్తా, నాగమళ్ల శ్రవణ్‌కుమార్, ఉమాపతి, దాచేపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయంలో న్యాయమూర్తి పూజలు

చంపాపేట, జూన్ 22(ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయాన్ని శనివారం హైకోర్టు న్యాయమూర్తి అనిల్‌కుమార్ కుటుంబ సభ్యులతో కలిసి సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన న్యాయమూర్తికి ఆలయ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, ఈఓ ఎం.శ్రీనివాసశర్మ, ధర్మకర్తలు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలోని వినాయకస్వామి, ధ్యానాంజనేయస్వామి సన్నిధిలో న్యాయమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ వేద పండితులు, అర్చకులు న్యాయమూర్తికి ఆశీర్వచనాలు అందించి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. ఆలయ ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

మైనర్‌పై యువకుడి లైంగికదాడి

- నిందితుడి అరెస్ట్, రిమాండ్


నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

హిమాయత్‌నగర్, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): ఓ మైనర్‌పై లైంగిక దాడికి పాల్పడిన యువకుడిని నారాయణగూడ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం నారాయణగూడ పీఎస్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్, ఎస్సై షఫీతో కలిసి సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సైఫాబాద్‌కు చెందిన మైనర్(16) నారాయణగూడలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. అదే ప్రాంతానికి చెందిన సయ్యద్ ఖలీల్(22) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. గత రెండేళ్లుగా ప్రేమికుడిగా నటిస్తూ బాలికను వేధిస్తున్నాడు. ఇటీవల బాలిక కళాశాలకు సరిగా రాకపోతుండడంతో యాజమాన్యం ఆమె తండ్రికి ఫోన్‌చేసి సమాచారం ఇచ్చింది. దీంతో బాలిక ఆచూకీ ఎంతకీ తెలియక పోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా నాంపల్లి రైల్వేస్టేషన్‌లో బాలికను గుర్తించిన పోలీసులు అక్కడికి వెళ్లారు. పోలీసులను చూసిన సయ్యద్‌ఖలీల్ పారిపోయాడు. బాలికను భరోసాసెంటర్‌కు తరలించి వాంగ్మూలం నమోదు చేశారు. ఆమెను ఓయోకు తీసుకెళ్లిన సయ్యద్‌ఖలీల్ తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలు తెలిపింది. అనంతరం నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. అతడి నుంచి యాక్టివా వాహనం, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై పోక్సోచట్టం కింద కేసు నమోదుచేసి, రిమాండ్‌కు తరలించారు.

మనీలాండరింగ్ కేసంటూ..

రూ.32.68 లక్షలు చోరీ

హైదరాబాద్‌సిటీ, జూన్ 22 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు.. రూ.32.68 లక్షల చోరీ చేశారు. ఇరాన్‌కు పంపిన పార్సిల్‌పై ఉన్న వివరాలు మనీ లాండరింగ్ కేసుల్లో నమోదై ఉన్నాయని నగరానికి చెందిన మహిళను భయపెట్టి, ఆమె ఖాతా నుంచి రూ.15.76 లక్షలను, గూగుల్ మ్యాప్‌కు రేటింగ్ ఇస్తే డబ్బులు ఇస్తామని నగరవాసిని నమ్మించి, అతని ఖాతా నుంచి రూ.16.68 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన మహిళకు గుర్తు తెలియని నెంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ప్రముఖ సంస్థ నుంచి ఫోన్ చేస్తున్నానని చెప్పిన వ్యక్తి 'మీ పేరుతో ఇరాన్‌కు పంపిన కొరియర్ తిరిగి వచ్చింది. నీకు పార్సిల్‌కు ఎలాంటి సంబంధమూ లేదు. ఈ విషయంపై సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయాలి' సూచించి, మరో వ్యక్తికి కనెక్ట్ చేశాడు. స్కైప్ కాల్ చేసిన నిందితుడు 'మీ ఆధార్‌కు లింక్ అయిన బ్యాంకు ఖాతాల నుంచి విదేశాలకు అక్రమంగా డబ్బు తరలి వెళ్లింది. మీ ఆధార్‌పై ముంబై అంధేరి పోలీస్‌స్టేషన్‌లో పలు కేసులు నమోదయ్యాయి' అని పత్రాలు చూపాడు. ఈ కేసులకు తనకు ఎలాంటి సంబంధమూ లేదని చెప్పగా, ' మీ బ్యాంకు ఖాతాల వివరాలు ఇవ్వాలి' అని సూచించాడు. 'మీ ఖాతాలో డబ్బులు ఆర్‌బీఐ అకౌంట్‌కు బదిలీ చేయాలి. 30 నిమిషాల్లో వెరిఫికేషన్ పూర్తి చేసి, మీ డబ్బు తిరగి మీ ఖాతాలో జమ చేస్తారు' అని చెప్పాడు. ఇలా చేయని పక్షంలో మనీ లాండరింగ్ కేసులో అరెస్ట్ అవుతారని బెదిరించాడు. నమ్మిన మహిళ తన ఖాతాలో ఉన్న రూ.15.76 లక్షలను అతడు సూచించిన ఖాతాకు బదిలీ చేసింది. తర్వాత మోసపోయానని గ్రహించిన మహిళ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

గూగుల్ మ్యాప్ రేటింగ్ పేరుతో..

రూ.16.68 లక్షలకు టోకరా

గూగుల్ మ్యాప్‌కు రేటింగ్ ఇస్తే డబ్బులు ఇస్తామని నమ్మించిన సైబర్ నేరగాళ్లు నగరవాసి నుంచి రూ.16.68 లక్షలు కాజేశారు. నగరానికి చెందిన వ్యక్తికి వాట్సప్‌కాల్ చేసిన సైబర్ నేరగాళ్లు గూగుల్ మ్యాప్‌కు రేటింగ్స్ ఇస్తే డబ్బులు ఇస్తామని నమ్మించారు. ముందుగా కొద్ది మొత్తం ఖాతాలో జమ చేశారు. మరింత డబ్బు కావాలంటే కొంత మొత్తం రీఫండబుల్ డిపాజిట్ చేయాలని సూచించారు. వారి మాటలు నమ్మిన వ్యక్తి రూ.16.68 లక్షలు వారు చెప్పిన ఖాతాకు బదిలీ చేశాడు. తర్వాత నుంచి ఫోన్‌లు స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి, సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు.